

పొత్తు పొసుగుతుందా?

27న రానున్న మోదీ కోసం బీజేపీ రాష్ట్ర నేతల ఎదురు చూపులు



పెరంబూర్, ఫిబ్రవరి 22: అధికారిక, ప్రైవేటు కార్యక్రమాల్లో భాగంగా రెండు రోజుల పర్యటన కోసం వస్తున్న మోదీ రాకపై బీజేపీ రాష్ట్ర నేతలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ పర్యటనలో లోక్‌సభ ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్న మోదీ.. రాష్ట్రంలో పొత్తులపైనా తేల్చేస్తారని భావిస్తున్నారు. రెండు రోజుల పర్యటన కోసం ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు త్రివేండ్రం నుంచి ప్రత్యేక విమానంలో కోయంబత్తూరు సమీపంలోని సూలూరు ఎయిర్‌ఫోర్స్ కేంద్రానికి చేరుకోనున్న ప్రధాని.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తిరుప్పూర్ జిల్లా పల్లడం వెళ్తారు. పల్లడం సమీపంలోని మాదాపూర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన 'ఎన్ మన్ ఎన్ మక్కల్' పాదయాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఈ సభకు బీజేపీ జాతీయ నేతలు తరలిరానున్నారు. ఈ కార్యక్రమం 2.45 నుంచి 3.45 వరకు జరగనుంది. ఆ తరువాత 3.50 గంటలకు ప్రధాని హెలికాప్టర్‌లో బయలుదేరి పల్లడం వెళ్తారు. సాయంత్రం 5 గంటలకు ఆయన మదురై చేరుకుంటారు. అక్కడ ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొని సాయంత్రం 7 గంటలకు మదురై తిరుప్పరంగుండ్రంలో ఉన్న ఓ స్టార్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడ ఆయన రాష్ట్ర ముఖ్య నేతలతో భేటీ కానున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆయా నేతలకు దిశానిర్దేశం చేయడంతో పాటు లక్ష్యాన్ని ఖరారు చేయనున్నారు. ఈ సారి ఎలాగైనా రాష్ట్రం నుంచి గణనీయమైన స్థానాలను పొందాలని ఆశిస్తున్న బీజేపీ అధిష్ఠానం.. ఆ మేరకు తీవ్ర ప్రయత్నాలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధాని.. రాష్ట్ర నేతలకు పలు కీలక సూచనలు చేయనున్నారు. ఆ సమావేశం అనంతరం బీజేపీతో జత కట్టాలనుకుంటున్న పార్టీలకు చెందిన నేతల కూడా మోదీతో సమావేశం కానున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులు, సీట్ల కేటాయింపు తదితరాలపై వారు మోదీ వద్ద స్పష్టత తీసుకోనున్నారు.

28న ఇస్రో కేంద్రానికి శంకుస్థాపన

28న ఉదయం 8.15 గంటలకు కారులో బయలుదేరి మదురై విమానాశ్రయం చేరుకుంటారు. 8.45 గంటలకు మదురై నుంచి ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌లో తూత్తుకుడికి చేరుకుంటారు. వీవోసీ హార్బర్‌లో పలు పథకాలను ప్రారంభించిన అనంతరం.. తిరుచ్చెందూర్ సమీపంలో వున్న కులశేఖరపట్టినం వెళ్లి, అక్కడ ఇస్రో తరఫున నిర్మించదలచిన రాకెట్ కేంద్రానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆధునికీకరించిన రామనాథపురం జిల్లా రామేశ్వరం - పాంబన్ రైల్వే వంతెనను కూడా ఆ వేదిక నుంచే జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం, మంత్రులు కూడా పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిశాక.. ఉదయం 10.30 గంటలకు తిరునెల్వేలి చేరుకుని అక్కడ జరిగే బీజేపీ బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం 12.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి కేరళకు వెళ్లనున్నారు. ప్రధాని రాక సందర్భంగా కోయంబత్తూరు, మదురై, తూత్తుకుడి, తిరునల్వేలి తదితర ప్రాంతాల్లో భద్రతను పటిష్ఠం చేశారు.



శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

కులగణనకు మేం వ్యతిరేకం కాదు

- కలైంజర్ స్మారక కేంద్రం ప్రారంభోత్సవానికి రండి
- ప్రతిపక్షాలకు సీఎం ఆహ్వానం
- ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కులాల వారీ గణనకు తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. శాసనసభ సమావేశాల్లో గురువారం పీఎంకే సభ్యులు మాట్లాడుతూ... కుల గణనను రాష్ట్రప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఈ విషయమై స్పష్టం చేశామని పేర్కొన్న ప్రభుత్వం... శాసనసభలో చర్చకు మాత్రం అనుమతించకపోవడం సమంజసం కాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్రంలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ పీఎంకే సభ్యులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అప్పావు జోక్యం చేసుకుంటూ... కేంద్రప్రభుత్వ గణన ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుందని గవర్నర్ ప్రసంగంలో రాష్ట్రప్రభుత్వం స్పష్టంగా పేర్కొందని, ఈ వ్యవహారంపై సభ్యులు అనవసర రాద్ధాంతం చెయ్యవద్దని విజ్ఞప్తి చేశారు. దీనిపై సంతృప్తి చెందని పీఎంకే సభ్యులు.. వాకౌట్ చేశారు. అనంతరం సీఎం స్టాలిన్ మాట్లాడుతూ... కులగణనకు సంబంధించి ప్రస్తుత సమావేశాల్లో పలుమార్లు స్పష్టం చేశామన్నారు. అలాగే, పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి, వేల్‌మురుగన్, జీకే మణి తదితరులు ఈ విషయమై తనను నేరుగా సంప్రదించారన్నారు. అప్పుడే తాను వారికి స్పష్టం చేశానని, కులగణనకు తాము వ్యతిరేకం కాదని, అందరికీ అనుకూలంగానే ప్రభుత్వం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

మదురై ఎయిమ్స్‌లా కాకుండా...

రాష్ట్ర బడ్జెట్‌పై పలు పార్టీల నేతలు ప్రసంగిస్తున్న తరుణంలో బుధవారం బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ మాట్లాడుతూ... కోవైలో గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, అయితే గ్రంథాలయం ఎక్కడ నిర్మిస్తారు? కేటాయించే నిధులు? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పుడు ముగిస్తారు వంటి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. దీనిపై గురువారం సీఎం సమాధానమిస్తూ... "వానతి శ్రీనివాసన్‌కు నేను ఒక్కటి మాత్రం చెప్పదలచుకున్నా. మదురై ఎయిమ్స్ ప్రకటనలా కాకుండా, నిర్ణీత కాలంలోనే కోవైలో గ్రంథాలయం నిర్మాణ పనులు చేపట్టి, 2026 జనవరిలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తాం. ప్రారంభోత్సవానికి మీకు ఆహ్వాన పత్రిక పంపుతాం. ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలి" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దీంతో సభ ఒక్కసారిగా ఘొల్లుమంది.

కలైంజర్ స్మారక కేంద్రం ప్రారంభోత్సవానికి రండి..

మెరీనా తీరంలో నిర్మించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక మందిరం ప్రారంభోత్సవానికి సభ్యులందరూ హాజరుకావాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆహ్వానించారు. గురువారం శాసనసభ సమావేశాల్లో సీఎం మాట్లాడుతూ... ఈనెల 27వ తేది రాత్రి 7 గంటలకు కలైంజర్ స్మారక మందిరం ప్రారంభించనున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్రానికి 'తమిళనాడు' అని పేరు పెట్టిన అరింజర్ అన్నా స్మారక మందిరాన్ని ఆధునికీకరించామని, ఈ మందిరాన్ని కూడా ప్రారంభించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష, కూటమి, సహచర పార్టీల సభ్యులందరూ పాల్గొనాలని ఈ సభ ద్వారా ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు.

ముగిసిన బడ్జెట్ సమావేశాలు...

శాసనసభ బడ్జెట్ సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈనెల 12న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన సమావేశాలు ఆద్యంతం వాడిగావేడిగా సాగాయి. మొదట్లో ప్రసంగం చదవకుండానే గవర్నర్ అర్ధాంతరంగా వెళ్లిపోవడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అనంతరం గవర్నర్ ప్రసంగాన్ని స్పీకర్ అప్పావు చదివి వినిపించారు. తదుపరి మూడు రోజులు గవర్నర్ ప్రసంగంపై చర్చ జరిగింది. అనంతరం శుక్ర, శని, ఆదివారాలు సమావేశాలకు సెలవులు ప్రకటించారు. అనంతరం 19వ తేది ఆర్థిక బడ్జెట్, 20వ తేది వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టారు. మంగళవారం నుంచి ఈ బడ్జెట్‌పై చర్చ జరగ్గా, సంబంధిత శాఖల మంత్రులు సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో, శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ అప్పావు ప్రకటించారు.

శాసనసభలో ఒకేరోజు 13 తీర్మానాలు ఆమోదం

పెరంబూర్, ఫిబ్రవరి 22: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో చివరి రోజైన గురువారం, ఆర్థిక, వ్యవసాయ బడ్జెట్లపై ఆయా శాఖల మంత్రులు తంగం తెన్నరసు, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం... సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అనంతరం, శాసనసభలో ఇదివరకే దాఖలు చేసిన 13 తీర్మానాలను మూజువాణి ఓటుతో ఆమోదించారు. వాటిలో, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్ల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 60 ఏళ్లకు పెంచడం, జాతీయ రహదారుల కమిషన్ లాగే తమిళనాడు రాష్ట్ర రహదారుల కమిషన్ ఏర్పాటు, తమిళనాడు పంచాయతీ చట్టంలో, భూగర్భ డ్రైనేజీ నీటి నిర్వహణ విభాగంలో సవరణ బిల్లు సహా 13 తీర్మానాలు ఉన్నాయి.



మహాబలిపురంలో కాంగ్రెస్ ఎస్సీ వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న సెల్వపెరుందగై

రాహుల్ ప్రధాని అయితేనే దేశం సుభిక్షం

- టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

ప్యారీస్, ఫిబ్రవరి 22: కేంద్రంలో అధికారంలో ఉన్న మతవాద బీజేపీ ప్రభుత్వం వల్ల దేశం పెనుప్రమాద అంచున ఉందని, ఈ పరిస్థితుల్లో దేశాన్ని రక్షించుకునేందుకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆకాంక్షించారు. టీఎన్‌సీసీ ఎస్సీ విభాగ ఆధ్వర్యంలో ఈసీఆర్ రోడ్డు మహాబలిపురంలోని జో బీచ్ రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను గురువారం ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ విభాగాల జాతీయ ఆర్గనైజర్ కె.రాజు, ఎస్సీ విభాగ జాతీయ అధ్యక్షుడు రాజేష్‌లియోధ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ నిరంజన్‌కుమార్ అధ్యక్షత వహించగా, ఏఐసీసీ కార్యదర్శులు అజయ్‌కుమార్, డాక్టర్ సిరివెల్ల ప్రసాద్, క్రిస్టోఫర్ తిలక్, పి.విశ్వనాథన్, సీడీ మెయ్యప్పన్, మత్స్యకారుల విభాగ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ ఫెర్నాండేజ్, ఉపాధ్యక్షుడు నిలవన్, కేఎస్ అళగిరి, మాజీ ఎంపీ పీటర్ అల్ఫోన్స్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సెల్వపెరుందగై మాట్లాడుతూ... రాష్ట్రంలో 1969లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ అధికారానికి దూరమైందన్నారు. పార్టీని మళ్లీ అధికారంలో కూర్చోబెట్టేందుకు అవసరమైన పథకాలతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ సీనియర్ల సూచనలతో కార్యకర్తలతో కలసి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే-కాంగ్రెస్ కూటమిని అన్ని స్థానాల్లో గెలిపించేందుకు ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇక దేశాన్ని కాపాడుకొనేందుకు రాహుల్ గాంధీ ప్రధానిగా రావాలని, ఆయన చేపట్టిన భారత్ జోడో యాత్ర, న్యాయ యాత్రలకు దేశప్రజలు నీరాజనం పడుతున్నారని అన్నారు. ముందుగా సచివాలయానికి వెళ్లిన ఏఐసీసీ జాతీయ నాయకులు అజయ్‌కుమార్, సిరివెల్ల ప్రసాద్, సెల్వపెరుందగై, ఎమ్మెల్యే రాజేష్‌కుమార్ తదితరులను రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, టీఎం అన్బరసన్ పుష్పగుచ్ఛం అందించి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం వారు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



80 వేల మంది టీచర్లకు పోర్టబుల్ కంప్యూటర్లు

- మంత్రి అన్బిల్ మహేష్ వెల్లడి

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది రాష్ట్రవ్యాప్తంగా 80 వేలమంది ఉపాధ్యాయులకు పోర్టబుల్ కంప్యూటర్లను పంపిణీ చేయనున్నట్టు రాష్ట్ర విద్యాశాఖామంత్రి అన్బిల్ మహేశ్ వెల్లడించారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ... సమాజ చైతన్యం కోసం విద్య మాత్రమే ఏకైక ఆయుధమని దివంగత కలైంజర్ పదేపదే వ్యాఖ్యానించేవారని, ఆయన కలను సాకారం చేసే విధంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా యేటా విద్యారంగానికి కేటాయించే నిధులను అంచెలంచెలుగా పెంచుతున్నారని గుర్తు చేశారు. దీంతో విద్యాశాఖలో అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఏ లక్ష్యం కోసమైతే విద్యాశాఖకు నిధులు కేటాయిస్తున్నారో అది నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి విద్యారంగం కోసం రూ.44,042 కోట్లను కేటాయించారని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖలో ప్రస్తుతం 57 కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అదేసమయంలో విద్యా సంవత్సరం మధ్యలో అర్ధంతరంగా పాఠశాల మానివేసే విద్యార్థుల సంఖ్య (డ్రాపౌట్స్) బాగా తగ్గిందన్నారు. అధునాతన టెక్నాలజీతో విద్యార్థులకు ఉన్నత విద్యను బోధించే వాతావరణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8,209 హైటెక్ ల్యాబోరేటరీలను, 22,931 ప్రాథమిక పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 80 వేల మంది ఉపాధ్యాయులకు పోర్టబుల్ కంప్యూటర్లను పంపిణీ చేస్తామన్నారు. తద్వారా రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో డిజిటల్ విధానంలో విద్యాబోధన సాగుతుందన్నారు. అదేసమయంలో ఆయా జిల్లాల విద్యాశాఖ ఉన్నతాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తమతమ ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని మంత్రి అన్బిల్ మహేష్ పిలుపునిచ్చారు.

నేడు చెన్నైకి కేంద్ర ఎన్నికల కమిషనర్




కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్‌కుమార్

ప్యారీస్, ఫిబ్రవరి 22: కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ రెండు రోజుల పర్యటన కోసం ఈనెల 23న శుక్రవారం చెన్నైకి రానున్నారు. ఆయన పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ మరో రెండు వారాల్లో ప్రకటించే అవకాశముంది. మొత్తం ఏడు విడతల పోలింగ్‌ను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు నడుం బిగించిన ఈసీ, దీనికి సంబంధించి అన్ని రాష్ట్రాల్లో పర్యటించి ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ, పోలీసుశాఖల ఉన్నతాధికారులతో సమావేశమవుతోంది. ఇందులో భాగంగా ఈసీ కమిషనర్ రాజీవ్‌కుమార్ శుక్రవారం ఉదయం చెన్నైలో వివిధ రాజకీయపార్టీల నేతలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు, కలెక్టర్లు, పోలీసుశాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు, భద్రత అంశాలు, ఓటర్లకు నగదు, బహుమతుల పంపిణీ చేయడాన్ని కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లడంపై కల్పించాల్సిన అవగాహన అంశాలపై రాజీవ్‌కుమార్ సూచనలిస్తారు. రెండో రోజైన శనివారం తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన ఆదాయపు పన్ను శాఖ, కస్టమ్స్ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం కానున్నారు. ఈ రెండు రోజుల సమావేశంలో తమిళనాడులోని 39 పార్లమెంటు నియోజకవర్గాలకు ఒకేరోజు పోలింగ్ నిర్వహించడం, సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు పారా మిలటరీ, సాయుధ దళాలతో భద్రత, ఈవీఎంలు, వీవీ పాట్‌లు పనితీరు తదితర అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది.

వార్డు అభివృద్ధి నిధిని రూ.60 లక్షలకు పెంచాలి

- కార్పొరేషన్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్
- ప్రజాకర్షక బడ్జెట్‌గా సభ్యుల ప్రశంస



సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్

అడయార్, ఫిబ్రవరి 22: చెన్నై నగర పాలక సంస్థ (చెన్నై కార్పొరేషన్) సమావేశం గురువారం నగర మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన జరిగింది. ఇందులో బుధవారం మేయర్ ప్రవేశపెట్టిన కార్పొరేషన్ బడ్జెట్‌పై రసవత్తర చర్చ జరిగింది. పలువురు సభ్యులు ఈ చర్చలో పాల్గొని, వార్డు నియోజకవర్గ అభివృద్ధి నిధిని రూ.60 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వీధి శునకాలకు గజ్జి ఎందుకు వస్తుందంటూ పలువురు సభ్యులు ప్రశ్నిస్తూనే, 2024-25 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను మెజారిటీ సభ్యులు అభినందించారు. ఆ తర్వాత ఈ బడ్జెట్‌పై జరిగిన చర్చలో పలువురు సభ్యులుపాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ... మంచి బడ్జెట్‌ను సమర్పించారంటూ మేయర్, డిప్యూటీ మేయర్‌కు అభినందనలు తెలిపారు. ఇందులో అనేక అభివృద్ధి పనులకు ప్రాధాన్యం కల్పించారన్నారు. అయితే, వార్డు కౌన్సిలర్ అభివృద్ధి నిధిని రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షలు పెంచారనీ, దీన్ని రూ.60 లక్షలకు పెంచాలని కోరారు. కౌన్సిలర్ సిత్రరసు మాట్లాడుతూ... చరిత్రలో ఎన్నడూ ప్రవేశపెట్టని విధంగా ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంపై కేంద్రం చిన్న చూపు చూస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి స్టాలిన్ మాత్రం అభివృద్ధి కోసం నిధులను కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. చెన్నై కార్పొరేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు అన్ని పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు. కౌన్సిలర్ సరిత మాట్లాడుతూ... ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం పెరంబూరు పేపర్ మిల్స్ రోడ్డు - సెంబియం రోడ్డును 18 మీటర్ల మేరకు విస్తరించేందుకు నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్‌కు వార్డు అభివృద్ధి నిధులను కేటాయించినట్టుగానే జోన్ కమిటీ అధ్యక్షుడికి కూడా అభివృద్ధి నిధులు కేటాయించాలన్నారు. కౌన్సిలర్ తనియరసు మాట్లాడుతూ... వార్డు అభివృద్ధి నిధులను రూ.75 లక్షలకు పెంచాలని కోరారు. గత పాలకులు చెన్నై కార్పొరేషన్‌కు లోటు బడ్జెట్‌లో ఉండగా, ఇపుడు రూ.850 కోట్ల మేరకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇలా అనేక మంది కౌన్సిలర్లు ప్రసంగించిన తర్వాత మేయర్ ఆర్.ప్రియ మాట్లాడుతూ... మేయర్ అభివృద్ధి నిధి రూ.2 కోట్లుగా ఉన్నదని, కానీ, గత యేడాది ఈ నిధిని పెంచలేదని, కానీ, ఇపుడు రూ.3 కోట్లకు పెంచామన్నారు. అదేవిధంగా వార్డు కౌన్సిలర్ అభివృద్ధి నిధిని రూ.35 లక్షల నుంచి రూ.45 లక్షలకు పెంచినట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మహేశ్ కుమార్, నగర కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

29న ఓపీఎస్ వర్గ జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, ఫిబ్రవరి 22: మాజీ సీఎం ఒ.పన్నీర్ సెల్వం వర్గ జిల్లా కార్యదర్శుల సమావేశం ఈ నెల 29న జరగనుంది. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... స్థానిక ఎగ్మూర్‌లోని ఫైస్ మహల్‌లో ఉదయం 10.30 గంటలకు జరగనున్న సమావేశానికి పార్టీ ప్రధాన నిర్వాహకులు, జిల్లా కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని ఓపీఎస్ కోరారు.

25న వక్తృత్వ పోటీలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: చేకిలార్ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు ఈ నెల 25వ తేది వక్తృత్వ పోటీలు జరుగనున్నాయి. స్థానిక మైలాపూర్ సావిత్రి అమ్మాళ్ ఓరియంటల్ మహోన్నత పాఠశాలలో 'వానముమ్...మన్నుమ్', 'కారైక్కాల్ అమ్మయార్ పురాణం', 'వేదముదల్‌వర్' వంటి వివిధ శీర్షికల్లో ఉదయం 9.30 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7,500, తృతీయ బహుమతిగా రూ.5 వేలు, ప్రోత్సాహక బహుమతులు తలా రూ.2 వేలు అందజేయనున్నారు.

నేడు డీఎంకే కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, ఫిబ్రవరి 22: డీఎంకే జిల్లా కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జుల సమావేశం ఈనెల 23న శుక్రవారం జరగనుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ నేతృత్వంలో ఉదయం 11.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే సమావేశంలో, పార్లమెంటు ఎన్నికల్లో విజయావకాశాలు, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాటు సహా పలు విషయాలను జిల్లా కార్యదర్శులను అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 22: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ మాసి నెల పౌర్ణమి గిరి ప్రదక్షిణ సందర్భంగా శుక్ర, శనివారాల్లో 1,084 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ తెలిపింది. ఆ ప్రకారం, 23వ తేది కిలంబాక్కం నుంచి తిరువణ్ణామలైకు 275 ప్రత్యేక బస్సులు, కాంచీపురం నుంచి 40, పుదుచ్చేరి నుంచి 30, బెంగళూరు నుంచి 20, వేలూరు నుంచి 55, తిరుచ్చి, సేలం, హోసూరు నుంచి తలా 50, కృష్ణగిరి నుంచి 20, ధర్మపురి నుంచి 30, ఇతర ప్రాంతాల నుంచి 62 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, 24వ తేది కిలంబాక్కం నుంచి 125, కాంచీపురం, పుదుచ్చేరి, బెంగళూరు నుంచి తలా 20, వేలూరు నుంచి 55, తిరుచ్చి, సేలం, హోసూరు నుంచి తలా 50, కృష్ణగిరి నుంచి 20, ధర్మపురి నుంచి 30, ఇతర ప్రాంతాల నుంచి 62 అని మొత్తం 502 ప్రత్యేక బస్సులు నడుపునున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఈటీసీ పేర్కొంది.

రేపటినుంచి తిరువళ్లూర్‌లో పుస్తక ప్రదర్శన

పెరంబూర్, ఫిబ్రవరి 22: తిరువళ్లూర్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నుంచి పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుందని కలెక్టర్ ప్రభుశంకర్ తెలిపారు. మార్చి 4వ తేది వరకు జరిగే ఈ ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పుస్తక కొనుగోళ్లపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చర్చావేదికలు, సాంస్కృతిక ప్రదర్శనలుంటాయని కలెక్టర్ తెలిపారు.

7న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కార్యక్రమాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: రాష్ట్ర బీజేపీ స్టార్టప్ విభాగం ఆధ్వర్యంలో 'ఇన్నోవేట్ తమిళనాడు' పేరుతో రాష్ట్రస్థాయిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కార్యక్రమాలను మార్చి 7వ తేది శ్రీవిల్లిపుత్తూర్ కలశలింగం విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి వారికి సలహాలు, ఆర్థిక సాయం, ప్రోత్సాహాలు ఇవ్వడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈకార్యక్రమంలో 15 వేల మందికి పైగా విద్యార్థులు,100మందికిపైగా యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. వివరాలకు నెం.9500696989లో సంప్రదించవచ్చు.

తిరుత్తణిలో గదులకు ఆన్‌లైన్ బుకింగ్ నిలిపివేత

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: తిరుత్తణిలో భక్తులు బస చేసే గదులకు ఆన్‌లైన్ బుకింగ్ నిలిపివేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని తమిళనాడు సహా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు సందర్శిస్తుంటారు. రాత్రుల్లో బస చేసే భక్తుల సౌకర్యార్థం తక్కువ అద్దెకు గుడారాలు, గదులను ఆలయ నిర్వాహకులు అద్దెకిస్తుంటారు. వీటిని బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానం అందుబాటులో ఉండగా, కరోనా కారణంగా వాటిని నిలిపివేశారు. లాక్‌డౌన్ నిబంధనలు సడలించినా యథావిధిగా ఆన్‌లైన్ బుకింగ్ జరగడం లేదు. ప్రైవేటు విడిదుల్లో రూ.600 నుంచి రూ.3 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారని, త్వరలో ఆలయ గదులను అద్దెకివ్వాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ... విడిది గదుల మరమ్మతులు జరుగుతున్నాయని, అప్పటివరకు తాత్కాలింగా ఆన్‌లైన్ బుకింగ్ నిలిపివేశామన్నారు.

26 నుంచి టెన్త్ ప్రాక్టికల్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: టెన్త్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 26వ తేది ప్రారంభం కానున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్న పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఇటీవల ప్రాక్టికల్ శిక్షణ ముగిసింది. ఈ పరీక్షలు ఈ నెల 26 నుంచి 28వ తేది వరకు జరగనున్నాయి. దరఖాస్తు చేసుకున్న ప్రైవేటు విద్యార్థులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

నేటినుంచి పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు

పెరంబూర్, ఫిబ్రవరి 22: విద్యార్థుల ఆధార్ నమోదు, సవరణలకు శుక్రవారం నుంచి ఆయా పాఠశాలల్లో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమరగురుపరన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఎల్కాట్ సంస్థ నుంచి 770 పరికరాలు కొనుగోలు చేసినట్లు, ప్రభుత్వ రాయితీలు, సహాయాలు పొందేందుకు ఆధార్ నెంబరు తప్పనిసరి కావడంతో ఈ పనులను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఆధార్ కోసం ఏ ఒక్క విద్యార్థి పాఠశాల నుంచి బయటకు పంపించరాదని, ఆ దిశగా జిల్లా విద్యాధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

సౌరశక్తి విద్యుదుత్పత్తిలో 4వ స్థానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: సౌరశక్తి విద్యుదుత్పత్తిలో రాష్ట్రం నాల్గో స్థానంలో ఉంది. ఈ విద్యుదుత్పత్తికి సూర్యరశ్మి కాకుండా వెలుతురుంటే సరిపోతుంది. రాష్ట్రంలో ఏడాదికి 300 రోజుల వరకు వెలుతురు లభిస్తోంది. జనవరి గణాంకాల ప్రకారం మొత్తం సౌర విద్యుత్ కేంద్రాల్లో రాజస్థాన్ 18,795 మెగావాట్లతో మొదటి స్థానంలో ఉండగా, 10,548 మెగావాట్లతో గుజరాత్ రెండో స్థానం, 9,463 మెగావాట్లతో కర్ణాటక మూడో స్థానం, 7,426 మెగావాట్లతో రాష్ట్రం నాలుగవ స్థానంలో ఉన్నాయి.

ఫోర్జరీ సంతకంతో ఎల్‌కే సుధీష్ భార్య వద్ద మోసం

రూ.43 కోట్ల నష్టం ● ఇద్దరి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 22: దివంగత సినీ నటుడు, డీఎండీకే అధ్యక్షుడు కెప్టెన్ విజయకాంత్ బావమరిది, సినీ నిర్మాత ఎల్‌కే సుధీష్ సతీమణి పూర్ణజ్యోతిని ఒక భవన నిర్మాణ కంపెనీ యజమానితోపాటు ఆయన అనుచరుడు మోసం చేశారు. ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేయడం వల్ల రూ.43 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బహుళ అంతస్తుల భవన నిర్మాణం పేరుతో ఈ మోసానికి పాల్పడ్డారు. గురువారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే... మాధవరం ప్రాంతంలో ఎల్‌కే సుధీష్ సతీమణికి సొంత స్థలం ఉంది. ఈ ప్రాంతంలో అపార్ట్‌మెంట్ నిర్మించి, విక్రయించేలా రియల్ ఎస్టేట్ కంపెనీతో పూర్ణజ్యోతి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పంద పత్రాల్లో మొత్తం 274 ఫ్లాట్లు నిర్మించి, వాటిలో 75 ఇళ్లను పూర్ణజ్యోతికి అప్పగించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే, రియల్ ఎస్టేట్ కంపెనీ యజమాని సంతోష్‌శర్మ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అందులో పేర్కొన్నట్టుగా 75 ఫ్లాట్లకుగాను కేవలం 48 ఫ్లాట్లను మాత్రమే కేటాయించారు. ఇందుకోసం ఆమె సంతకాలను ఫోర్జరీ చేసి కొత్తగా ఒప్పంద పత్రాలను సృష్టించారు. ఈ మోసం కారణంగా పూర్ణజ్యోతికి రూ.43 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. దీంతో ఆమె సంతోష్‌శర్మతో పాటు ఆయన అనుచరుడు సాగర్‌పై ఆమె చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు విచారణ చేపట్టగా, రియల్ ఎస్టేట్ కంపెనీ మోసానికి పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధరించారు. దీంతో సంతోష్ శర్మతో పాటు సాగర్‌ను నగర పోలీసులు అరెస్టు చేసి, వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

మాతృభాషపై విద్యార్థులు పట్టు సాధించాలి

● తెలుగు తరణి అధ్యక్షురాలు కాసల రమణి


విజేతలతో నిర్వాహకులు

ప్యారీస్, ఫిబ్రవరి 22: తెలుగు మాధ్యమంలో చదువుకుంటున్న విద్యార్థులు మాతృభాషపై మరింత పట్టు సాధించి భాషాభివృద్ధికి కృషి చేయాలని తెలుగు తరణి సంస్థ అధ్యక్షురాలు కాసల రమణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని టి.నగర్‌లోని ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రధాన కార్యాలయంలో తెలుగు తరణి ఆధ్వర్యంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా చక్కని చదువరి, జాతీయ నాయకులపై వ్యాసరచన, ప్రశ్నోత్తరి, పద్య పఠనం, చేతి రాత పోటీలు నిర్వహించగా, నగరంలోని ఎస్కేపీడీ బాలుర పాఠశాల, కేటీసీటీ బాలికల పాఠశాల, టి.నగర్, మైలాపూర్ ప్రాంతాల్లోని కేసరి పాఠశాలలకు చెందిన 42 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యదర్శి పోతూరి దేవసేన, కోశాధికారి మేదూరి అపర్ణ, సభ్యులు శైలజ, విశాలాక్షి, మాలతి, వసంత, పద్మ, మల్లికా ప్రకాష్, శ్రీదేవి, కర్లపాటి లక్ష్మి, నందిని, మణిమాలరావు, టి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ఆలిండియా రేడియో రిటైర్డ్ ఉద్యోగి బిత్రా గజగౌరి, కె.రమాదేవి వ్యవహరించారు. కార్యక్రమంలో రమణి మాట్లాడుతూ... చెన్నైలో కనుమరుగవుతున్న తెలుగు భాషను రక్షించుకొనేందుకు, మునుపటిలాగే తెలుగు మీడియంతో కార్పొరేషన్ పాఠశాలలను పునఃప్రారంభించేందుకు తెలుగు సంఘాలన్నీ సంఘటిత ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, ఫిబ్రవరి 22: వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా జిల్లా ప్రధాన విద్యాధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో ఇప్పటివరకు 57 పథకాలు అమలు చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాల అనేది పేదల పాఠశాల కాదని, గౌరవం చేకూర్చే పాఠశాల అని తల్లిదండ్రులు తెలుసుకొనేలా అవగాహన ప్రచారాలు చేపట్టాలని మంత్రి కోరారు.

ఇతరుల పేరుతో స్టాంపు పేపర్లు కొనుగోలు చేస్తే చర్యలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: అన్ని పత్రాలకు సంబంధించిన స్టాంప్ పేపర్లను ఇతరుల పేరుతో కొనుగోలు చేస్తే చర్యలు చేపడతామని రిజిస్ట్రేషన్ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్‌లకు ఆ శాఖ పంపిన సర్క్యులర్‌లో... రిజిస్ట్రేషన్‌కు వచ్చే దస్తావేజులు క్షుణ్ణంగా పరిశీలించాలని, స్టాంప్ పేపర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొంది. ఎవరి పేరుతో వాటిని కొనుగోలు చేస్తున్నారు అనే విషయాన్ని గమనించి, ఇతరుల పేరుతో కొనుగోలు చేస్తే చర్యలు చేపట్టాలని సూచించింది. ఏ తేదీన స్టాంప్ పేపర్లు కొనుగోలు చేశారో ఆ తర్వాత రోజులో రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని పేర్కొంది. అలాగే, కొనుగోలు చేసిన తేది నుంచి ఏడాదిలోపు మాత్రమే ఆస్తుల మార్పిడి రిజిస్ట్రేషన్లు జరగాలని ఆ శాఖ పేర్కొంది.

మందుల చీటీలో 'కాపిటల్' అక్షరాలు

● ఆరోగ్యశాఖ ఉత్తర్వులు

పెరంబూర్, ఫిబ్రవరి 22: రోగులకు మందులు చీటీ అందించే సమయంలో 'కాపిటల్' అక్షరాలు నమోదు చేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రోగులకు అర్థమయ్యేలా వైద్యులు రాసే చీటీల్లోని మందుల వివరాలు ఉండేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ఆరోగ్యశాఖ ఇప్పటికే అన్ని రాష్ట్రప్రభుత్వాలకు సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో, మందుల చీటీల్లో కాపిటల్ అక్షరాలు ఉండేలా వైద్యులు నమోదు చేయాలని, ఈ ఉత్తర్వులను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తప్పక పాటించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

23, 24 తేదీల్లో చేపల వేట నిషేధం

పెరంబూర్, ఫిబ్రవరి 22: కచ్చాదీవి ఆంథోనియర్ ఆలయ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 23, 24 తేదీల్లో రామేశ్వరం, పాంబన్ ప్రాంతాలకు చెందిన ఫైబర్, నాటు పడవల జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులు ఉల్లంఘించి చేపల వేటకు వెళ్లే జాలర్లపై చర్యలు చేపడతామని మత్స్యశాఖ హెచ్చరించింది.

ఆధ్యాత్మిక యాత్ర రద్దు

కచ్చాదీవిలో నిర్వహించనున్న సెయింట్ ఆంథోనియార్ ఆలయ ఉత్సవాలకు భారత్ నుంచి ఈ ఏడాది ఎవరూ వెళ్లడం లేదని కచ్చాదీవి ఉత్సవ కమిటీ తెలియజేసింది. కచ్చాదీవి ఆలయ ఉత్సవాలు ఈ నెల 23, 24 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో, ఉత్సవ కమిటీ ఈ ప్రకటన చేసింది. జాలర్లను చేపల వేట మానుకొని ఆందోళన చేపడుతుండడంతో, భారత్ నుంచి భక్తులు వెళ్లాల్సిన ప్రయాణాన్ని రద్దు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

టన్ను చెరకు కొనుగోలు ధర రూ.4,000 పెంచాలి

● పీఎంకే నేత రాందాస్

ప్యారీస్, ఫిబ్రవరి 22: రైతుల నుంచి కొనుగోలు చేసే చెరకు గిట్టుబాటు ధర ప్రకటించి, టన్నుకు రూ.4,000 పెంచాలని పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో... దేశవ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెరకు కోత సీజన్‌లో 10.25 శాతం తీపి కలిగిన చెరకు టన్నుకు రూ.3,400, 9.50 శాతం కంటే తక్కువ తీపి కలిగిన చెరకుకు రూ.3,150 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిందని, అయితే చెరకు రైతుల సంక్షేమం, వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చేలా టన్ను చెరకుకు రూ.4 వేలుగా కొనుగోలు ధర ప్రకటించాలని, రాష్ట్రప్రభుత్వం తన వాటా కింద చక్కెర ఫ్యాక్టరీల ద్వారా రైతలకు రూ.1,000 ప్రోత్సాహక నిధి ప్రకటించాలని రాందాస్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి


ఘటనలో నుజ్జునుజ్జయిన కారు

వేలూరు, ఫిబ్రవరి 22: తిరువణ్ణామలై జిల్లాలో గురువారం తెల్లవారుజామున కారు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందారు. విల్లుపురం జిల్లా కప్లాంపాడికి చెందిన కలైసెల్వికి కీల్‌పెన్నాత్తూర్ సమీపంలో ఉన్న విల్లుపురం జిల్లా కడలాడికుళంలోని కల్యాణ మండపంలో వివాహం జరుగుతోంది. కలైసెల్వన్ అన్న పాండ్యన్ (25) తిరువణ్ణామలైలోని ఒక మందుల దుకాణంలో పని చేస్తున్నారు. బుధవారం రాత్రి కారులో తన స్నేహితులు అయగన్ (38), ప్రకాష్ (34), చిరంజీవి (40)తో తిరువణ్ణామలైకు బయల్దేరాడు. సోయాసిపడి పుదూర్ మార్గంలో వెళుతున్న కారు హఠాత్తుగా ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, పాండ్యన్, అయగన్, ప్రకాష్ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రగాయాలైన చిరంజీవిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనలో గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ పూంగావనంను తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్సలనంతరం పుదుచ్చేరి ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కీల్‌పెన్నాత్తూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వైభవంగా మాతమ్మ ఆలయ అష్టబంధన కుంభాభిషేకం


గోపుర కలశాలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 22: స్థానిక పాతచాకలిపేట పరశురామన్ వీధిలో వందేళ్ల చరిత్ర కలిగిన మాతమ్మ ఆలయ జీర్ణోద్ధారణ అష్టబంధన మహా కుంభాభిషేకం గురువారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ పురాతన ఆలయానికి బాలాలయం, జీర్ణోద్ధరణ పనులను ఆలయ అధికారులు పూర్తిచేసిన సందర్భంగా నూతన ఆలయ ప్రాంగణంలో ఈనెల 19నుంచి ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాలను నాలుగు రోజుల పాటు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పెద్దలు, గ్రామస్తులు, కార్యనిర్వాహక కమిటీ, తిరుమల పాదయాత్ర భక్తులు, పెంచల నరసింహస్వామి భక్తులు, వెంకటేశ్వర కళా మందిర్, జిష్ణు గణపతి సభ్యులు, మణికంఠన్ సేవా సమితి భక్తులు, పలువురు దాతల సమక్షంలో ఆలయ ప్రధాన గోపురాలపై ప్రతిష్ఠించిన కలశాలకు పవిత్ర జలాలతో కుంభాభిషేకం క్రతువును నిర్వహించారు. అర్చకులు చల్లిన పుణ్యజలాలతో భక్తులు పరవశించిపోయారు. చివరగా భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

రూ.30 లక్షలతో తారు రోడ్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: స్థానిక తిరువొత్తియూర్ మండలంలో రూ.30 లక్షలతో తారు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 11వ వార్డు పెరియమేట్టుపాళయం వీధి సహా నాలుగు వీధుల్లో తారు రోడ్ల పనులు ప్రారంభించినట్లు ఈనెల 17వ తేది ప్రకటన విడుదలైంది. ఆ ప్రకారం, బుధవారం మండల కమిటీ అధ్యక్షుడు తనిఅరను ఈ పనులు ప్రారంభించారు.

3,200 మంది ఫ్లయింగ్ స్క్వాడ్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడడాన్ని అడ్డుకొనేందుకు 3,200 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ప్రభుత్వ పరీక్ష శాఖ నియమించింది. రాష్ట్రంలో ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 1న ప్రారంభం కానుండగా 7.15 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అవకతవకలు లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు పరీక్ష శాఖ ముందస్తు ఏర్పాట్లు చేపడుతోంది. పరీక్షలకు ఇంకా వారం రోజులుండగా అన్ని జిల్లా ప్రధాన విద్యాధికారుల ద్వారా ప్రధానోపాధ్యాయులకు పరీక్షకు సంబంధించిన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అలాగే, విద్యార్థులు కాపీయింగ్ పాల్పడకుండా ఉండేలా ప్లస్‌వన్, ప్లస్‌టూ పరీక్షలకు 3,200 మంది, టెన్త్ పరీక్షలకు 3,350 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించింది. ప్లస్‌వన్, ప్లస్‌టూ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 3,302 కేంద్రాలు, ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు 4,107 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. అలాగే, ప్రశ్నపత్రాల కోసం 154, జవాబుపత్రాలను భద్రపరిచేందుకు 219 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలో విద్యుత్ కోతలు తలెత్తకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచాలని తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జులు

● తమిళగ వెట్రిక్కళగం

ప్యారీస్, ఫిబ్రవరి 22: సినీ హీరో దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం తరపున త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులను నిర్వహించేందుకు రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలకు పార్టీ తరపున ఇన్‌చార్జులను ఎంపిక చేయనున్నట్లు ఆ పార్టీ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. పార్లమెంటు ఎన్నికల ముందే సభ్యత్వ నమోదు చేపట్టి సుమారు 2 కోట్ల మందిని చేర్చాలన్నదే విజయ్ లక్ష్యమని ఆ పార్టీ పెద్దలు తెలిపారు.

పెరియకుళత్తుపట్టిలో ఉత్సాహంగా జల్లికట్టు

ప్యారీస్, ఫిబ్రవరి 22: తిరుచ్చి సమీపంలోని పెరియకుళత్తుపట్టిలో గురువారం నిర్వహించిన జల్లికట్టు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ గ్రామంలో కొలువైఉన్న సెయింట్ ఆరోగ్య మేరీమాత ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో తిరుచ్చి, తంజావూరు, మదురై, శివగంగ తదితర జిల్లాల నుంచి 650కి పైగా పోట్లగిత్తలతో యజమానులు పాల్గొనగా, 300మంది యువకులు మైదానంలో రంకెలేసిన ఎద్దులను అదుపుచేసేందుకు సాహసం ప్రదర్శించారు. ముందుగా రాష్ట్ర పశుసంవర్థక శాఖ వైద్యులు ఎద్దులకువైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం చర్చి ప్రధాన పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పోటీలు ప్రారంభించారు. వాడివాసల్ మీదుగా ఉదయం 9 గంటలకు పోట్లగిత్తలను మైదానంలో వదిలి ఆర్డీఓ దక్షిణామూర్తి పోటీలు ప్రారంభించారు. జిల్లా యంత్రాంగం జారీ చేసిన టోకెన్లు కలిగిన వీరులు 25 మందిని గ్రూపుగా విభజించి ఎద్దులను అణచేందుకు అనుమతించారు. ఈ పోటీల్లో ఎవరికి పట్టుబడని ఎద్దుల యజమానులు, గెలిచిన యువకులకు నిర్వాహకులు నగదు, వెండి నాణేలు, మోటరు సైకిల్, ఫ్యాన్ తదితరాలను పంపిణీ చేశారు.

3 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 22: ఉత్తర చెన్నై ఆహార భద్రత శాఖ అధికారులు వ్యాసర్పాడి, ముల్లైనగర్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వ్యాసర్పాడి, ఎంకేబీ నగర్, ముల్లైనగర్, ఎంజీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో బియ్యాన్ని కొంతమంది కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆహార భద్రత విభాగం అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో బుధవారం పోలీసుల భద్రత మధ్య అధికారులు సంబంధిత ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఇన్బరసన్, దిలీప్ ఓ వాహనంలో తరలిస్తున్న లోడును తనిఖీ చేసి అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. సుమారు 3 టన్నుల రేషన్ బియ్యాన్ని వారి నుంచి స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయం కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు.

మహిళా టీచర్‌పై లైంగిక వేధింపులు

ప్యారీస్, ఫిబ్రవరి 22: స్థానిక తిరుమంగళంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మహిళా టీచర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలంటూ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న 25 ఏళ్ల యువతిపై మంగళవారం సాయంత్రం విద్యార్థులు ఎవరూ లేని సమయం చూసి ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఫిర్యాదులో తెలిపారు. దీనిపై తిరుమంగళం మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి సిబ్బందితో పాఠశాలకు వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. బాధిత టీచర్ ఫిర్యాదులో వాస్తవాలు రాబట్టేలా ప్రిన్సిపాల్ వద్ద విచారణ ప్రారంభించారు.

అమ్మవారి కనుల నుంచి ప్రసరించిన కాంతి కిరణాలు


అమ్మవారిని చూసేందుకు తరలివస్తున్న భక్తులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: తిరునెల్వేలి జిల్లా దిశయన్‌విలై శ్రీదేవి అంకాళ పరమేశ్వరి విగ్రహం కళ్లనుంచి కాంతికిరణాలు ప్రసరించిన సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో 21 రోజుల క్రితం వర్షాభిషేకోత్సవాలు జరిగాయి. అనంతరం ప్రతిరోజు ఉదయం ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, యథావిధిగా పూజారి ధర్మరాజ్ బుధవారం ఆలయాన్ని తెరిచారు. అమ్మవారి కళ్ల నుంచి కాంతి వెలువడడంతో దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంత మంది భక్తులు ఈ సన్నివేశాన్ని ఫొటోలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

మరో నెలలో 5 వేల ఉద్యోగాల భర్తీ

● ఆరోగ్య మంత్రి సుబ్రమణ్యం

అడయార్, ఫిబ్రవరి 22: మరో నెల రోజుల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో 5100 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు ఆరోగ్య మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. తమిళనాడు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలోని ఆడిటోరియంలో తమిళనాడు మెడికల్ సర్వీసెస్ కమిషన్ ద్వారా ఎంపికైన 322 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు ఉద్యోగ నియామక ధృవీకరణ పత్రాల అందజేత కార్యక్రమం గురువారం జరిగింది. ఇందులో మంత్రి సుబ్రమణ్యం పాల్గొని నియామక పత్రాలను అందజేశారు. ఆ తర్వాత ఆయన ప్రసంగిస్తూ... సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీన 1021 వైద్య పోస్టుల కోసం ఎంపికైన వారికి పని నియామక పత్రాలను అందించామన్నారు. అదేవిధంగా గత 11న 977 నర్సు పోస్టులకు నియామక పత్రాలను అందజేశామన్నారు. వీరంతా విధుల్లో చేరేందుకు 15 రోజుల సమయం ఇచ్చామన్నారు. తాజాగా ఈ శాఖలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేశామన్నారు. ఇదే విధంగా 2250 మంది గ్రామీణ నర్సులు, 986 వైద్యులు, 1066 హెల్ ఇన్‌స్పెక్టర్లు, 798 వివిధ రకాలైన వైద్య సిబ్బంది పోస్టులతో కలుపుకుని మొత్తం 5,100 ఉద్యోగాలను మరో నెల రోజుల్లో భర్తీ చేస్తామని తెలిపారు.

రవాణా శాఖలోని ఖాళీలను భర్తీ చేస్తాం

● మంత్రి శివశంకర్

అడయార్, ఫిబ్రవరి 22: రవాణా శాఖలోని ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర రవాణా శాఖామంత్రి పి.శివశంకర్ తెలిపారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం జరిగిన సభా కార్యక్రమాల ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి శివశంకర్ సమాధానమిచ్చారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన బస్సులను కరోనా మహమ్మారి కారణంగా నిలిపేసినట్టు చెబుతున్నారని, నిజానికి కొవిడ్ కారణంగా నిలిపివేయలేదని, తగినంతమంది డ్రైవర్లు, కండక్టర్లు లేకపోవడమే కారణమన్నారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలో డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తమిళనాడు స్టేట్ ఎక్స్‌ప్రెస్ కార్పొరేషన్‌కు డ్రైవర్లతో పాటు ఇతర సిబ్బంది నియామక చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా ఇతర కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, కండక్టర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ సిబ్బంది నియామకం పూర్తయిన వెంటనే నిలిపివేసిన రూట్లలో మళ్లీ బస్సులను నడుపుతామని ఆయన పేర్కొన్నారు.

రూ.80 కోట్లతో వళ్లువర్‌కోట్టం సుందరీకరణ

● మంత్రి ఏవీ వేలు వెల్లడి

స్థానిక నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టం సుందరీకరణ పనులను రూ.80 కోట్లతో చేపట్టనున్నట్టు రాష్ట్ర మంత్రి ఏవీ వేలు తెలిపారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ వళ్లువర్‌కోట్టంను నిర్మించేందుకు 1974లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత కలైంజర్ భూమిపూజ చేశారన్నారు. 1976లో నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రారంభించారన్నారు. అంతేకాకుండా, 5 ఎకరాల విస్తీర్ణంలో పల్లవరాజులు, ద్రావిడ కళల సంస్కృతి ప్రతిబింబించేలా పునర్నిర్మిస్తున్నామన్నారు. ఇక్కడ ఉన్న రాతి రథం 128 అడుగుల ఎత్తు, 67 మీటర్ల పొడవుతో ఉందన్నారు.గత పదేళ్ళుగా ఈ ప్రాంతం శిథిలావస్థకు చేరుకుందన్నారు. అందుకే రూ.80 కోట్ల వ్యయంతో దీన్ని సుందరీకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

చెరకు సేకరణ ధరను పెంచాలి

● కె.అన్నామలై డిమాండ్

అడయార్, ఫిబ్రవరి22:గత ఎన్నికల సమయంలోఇచ్చిన హామీల్లో భాగంగా చెరకు ధరను టన్నుకు రూ.400 పెంచుతామని ఇచ్చిన హామీని డీఎంకే ప్రభుత్వం పెంచలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై ట్వీట్ చేశారు. ఇదే విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇటీవల జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో చెరకు సేకరణ ధరను క్వింటాల్‌కు రూ.315 నుంచి రూ.340కుపెంచిందని,అందువల్ల రాష్ట్రప్రజల తరపున ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. అయితే, డీఎంకే ఇచ్చిన హామీల్లో భాగంగా చెరకు సేకరణ ధరను రూ.400కు పెంచలేదని గుర్తుచేశారు.

అన్నాడీఎంకే మాజీ నేతకు నటి త్రిష లీగల్ నోటీస్

● 24 గంటల్లో క్షమాపణ చెప్పాలంటూ అల్టిమేటం

అడయార్, ఫిబ్రవరి 22: తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బహిష్కృత అన్నాడీఎంకే నేత ఏవీ రాజుకు సినీ నటి త్రిష లీగల్ నోటీసులు పంపించారు. తనను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలకు 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని ఆమె అల్టిమేటం జారీచేశారు.. ఈ మేరకు ఆమె తరపున న్యాయ విభాగం ఈ నోటీసులు జారీ చేయించారు. తన గురించి ఏవీ రాజు చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీడియాలో ప్రచురించిన కథనాల ఆన్‌లైన్ లింకులను ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. 24 గంటల్లో క్షమాపణ చెప్పకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్ర జాలరికి ఆరు నెలల జైలుశిక్ష

పెరంబూర్, ఫిబ్రవరి 22: రాష్ట్రానికి చెందిన జాలరికి శ్రీలంక న్యాయస్థానం ఆరు నెలలు జైలుశిక్ష విధించడంపై జాలర్ల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం సరిహద్దులు దాటి చేపల వేట సాగిస్తున్నారంటూ రామేశ్వరానికి చెందిన 19 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. వీరిలో 18 మందిని విడుదల చేస్తూ శ్రీలంక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, మరో జాలరి, పడవ యజమాని జాన్సన్‌కు ఆరునెలల జైలుశిక్ష విధించడంతో ఆయన్ను జాఫ్నా జైలుకు తరలించారు. ఇప్పటికే రాష్ట్రానికి చెందిన ముగ్గురు జాలర్లకు శ్రీలంక న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం మరో జాలరికి జైలుశిక్ష విధించడంతో జాలర్ల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమస్య పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సత్వరం చర్యలు చేపట్టాలని, లేకపోతే లంక నావికాదళం అమానుష చర్యలతో మరింతమంది జాలర్లు శ్రీలంకలోని జైళ్లలోశిక్ష అనుభవించాల్సి వస్తుందని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

చెన్నై ఎయిర్‌పోర్టులో చిత్తూరు మహిళ అరెస్టు

● 68 సిమ్ కార్డులు స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 22: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాకు చెందిన రోజా (40) అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 68 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకుని, ఆమె వద్ద విచారణ జరుపుతున్నారు. గురువారం చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్‌కు వెళ్లేందుకు ఒక విమానం సిద్ధంగా ఉండగా, అందులో ఎక్కిన ప్రయాణికుల లగేజీలను కస్టమ్స్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో చిత్తూరుకు చెందిన మహిళ వద్ద 68 సిమ్ కార్డులు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సిమ్‌కార్డుల అంశంపై ఆమెను ప్రశ్నించగా వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎయిర్‌పోర్టుకు వచ్చి వేచిచూస్తుండగా ఒక వ్యక్తి వచ్చి ఒక బ్యాగు ఇచ్చి, దుబాయ్ ఎయిర్‌పోర్టులో ఒక మహిళ చేతికి ఇవ్వాలని సూచించారని చెప్పారు. అయితే, కస్టమ్స్ అధికారులు ఆ మహిళ చెప్పిన మాటలను నమ్మకుండా ఆమెను అరెస్టు చేశారు.

పెరియార్ సహకార తాగునీటి పథకం ట్రయల్ రన్‌కు సిద్ధం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 22: పెరియార్ సహకార తాగునీటి పథకం ట్రయల్ రన్‌కు సిద్ధమైంది. మదురై కార్పొరేషన్‌లో పైప్ లైన్ ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు రూ.1,685 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పనులను అధికారుల బృందం ఇటీవల పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించి 37 ఓవర్ హెడ్ ట్యాంకులను నింపి వాటి ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



గర్భాలయ మండపంపై దశావతారాల ఫైబర్ గ్లాస్ పెయింటింగ్స్



రుక్మిణీ సమేత పాండురంగస్వామి సాలగ్రామ మూలవిగ్రహాలు

అలమేలుమంగ సమేత వేంకటాచలపతి...

తమిళ మాసమైన పెరటాసి నెలలో ప్రతి శనివారం స్వామివారికి వెండి కవచాన్ని ధరింపజేస్తారు. వేంకటేశ్వరస్వామిలా సర్వాభరణాలతో అలంకరిస్తారు. శంఖు, చక్ర, కౌస్తుభం, సాలిగ్రామ మాల, సహస్రనామ మాల ధరింపజేస్తారు. ఎడమవైపు ఛాతీపై మహాలక్ష్మీదేవి కొలువై దర్శనమిస్తుంది. ఖడ్గధారుడై, పీతాంబరం ధరించి స్వామివారు కనువిందు చేస్తారు. స్వామి వారి పక్కనే అలమేలుమంగమ్మ కూడా సర్వాలంకరణశోభితురాలై కటాక్షిస్తుంది.

ఆధ్యాత్మికం



పండరీపురాన్ని తలపించేలా నిర్మితమైన ప్రధానాలయం

తిరువణ్ణామలై జిల్లా వందవాసి సమీపంలోని తెన్నాంగూరులో రుక్మిణీ సమేత పాండురంగనాథస్వామి ఆలయం దక్షిణ పండరీపురంగా ఖ్యాతి గడించింది. నలువైపులా కంటికి ఇంపైన పచ్చదనంతో, ఉద్యానవనాలతో, ఉత్తర, దక్షిణ భారతీయ శిల్పకళలను చాటే రీతిలో నిర్మితమైన అందమైన ఈ ఆలయాన్ని తిలకించేందుకు వెయ్యి కళ్లు చాలవని అనడం అతిశయోక్తి కాదు. ఒడిశాలోని పూరీ జగన్నాథస్వామి ఆలయ గోపురాన్ని తలపించేలా ఎత్తైన గర్భాలయ గోపురం అందాలు భక్తులను మైమరపిస్తుంది. ఆ ప్రధాన ఆలయం చుట్టూ ఉన్న గోపురాలు పల్లవుల శిల్పకళతో అందంగా నిర్మితమై ఉన్నాయి. ఈ ఆలయాన్ని దర్శించే భక్తులకు వింత అనుభూతికి గురవుతారు. తమ కష్టాలను పండరినాథుడికి విన్నవించుకోవాలని ఆరాటపడి వచ్చే భక్తులంతా ఆలయ సొబగులు చూసి గర్భాలయంలో నిలిచిన భంగిమలో ఉన్న అందమైన పాండురంగడి మోహనాకారాన్ని దర్శించుకుని పారవశ్యం చెంది, ప్రశాంతచిత్తులై తమ కష్టాలను సైతం మరచిపోతుంటారు. అయినా ఆ భక్తకోటిని స్వామివారు అష్టైశ్వర్యాలతో అనుగ్రహిస్తుంటారు. - ఆంధ్రజ్యోతి, చెన్నై



ఆలయ ప్రాకార రాజగోపురం

దక్షిణ పండరీపురంగా విలసిల్లుతున్న తెన్నాంగూరు

● సకల సంపదలిచ్చే రుక్మిణీ సమేత పాండురంగడు

క్షేత్రపురాణం...

శ్రీమద్భాగవతం 'కలౌ సంకీర్తనాయ కేశవం' అని చెబుతుండగా పురందరదాసు 'కలియుగ దల్లి హరినామమవా నేనెదరే కుల కోడిగలు ఉత్తరీసువవ' అని పాడారు. ఆది శంకర భగవద్పాదులు 'భజగోవిందం భజగోవిందం... గోవిందం భజమూఢమతే' అని కీర్తించారు. ఆదిశంకరుల వంశీయులైన బోధేంద్ర సరస్వతి స్వామి కలియుగంలో నామసంకీర్తన మాత్రమే మోక్షాన్ని ప్రసాదిస్తుందని ఉద్ఘాటించారు. మహారాష్ట్రలో జన్మించిన చాలామంది సాధువులు విఠల్‌గా ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణుడిని స్తుతిస్తూ 'అభంగ్స్' (మరాఠీ భాషలో భక్తి కవిత్వం) పాడారు. అలాంటివారిలో అగ్రగణ్యులైన స్వామి హరిదాస్‌గిరి పాండురంగ భగవంతుడిని పవిత్ర నామాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు. తమిళనాట భారీ ఆశ్రమం, ఆలయ సముదాయాన్ని నిర్మించారు. ఆశ్రమ సముదాయంలో ఆయన రుక్మిణీ సమేత శ్రీపాండురంగనాథుడి కోసం ఓ అందమైన ఆలయాన్ని నిర్మించారు. దైవ స్వప్నం ద్వారా ఈ ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పం జనించింది. మహారాష్ట్రలో పర్యటిస్తూ స్వామి హరిదాస్‌గిరి మంగళ్‌వాడీ గ్రామంలో ఓ రోజు రాత్రి బస చేశారు. ఆ రాత్రి కలలో తన గురువైన జ్ఞానానందగిరి ప్రత్యక్షమై వెంటనే పండరీపురానికి వెళ్లమని ఆజ్ఞాపించారు. మరో ఆలోచన లేకుండా ఆయన పండరీపురం చేరుకున్నారు. అద్భుతమేమిటంటే, పండరీపురం ఆలయ ప్రధాన అర్చకుడికి కూడా ఆ ముందు రోజు రాత్రి కలవచ్చింది. ఆ కలలో పాండురంగ స్వామి ప్రత్యక్షమై స్వామి హరిదాస్‌గిరి విచ్చేస్తే ఆయనకు తన చిన్న విగ్రహాన్ని ఇవ్వమని ఆదేశించారు. ఆ చిన్న విగ్రహం సంతాన భాగ్యం లేని దంపతుల ద్వారా ఆ ఆలయానికి కానుకగా లభించింది. ఆ విగ్రహాన్ని రోజువారీ పూజల కోసం పండరీపురం ఆలయ గర్భగుడిలో ఉంచారు. హరిదాస్‌గిరి రాగానే పండరీనాథుడి ఆజ్ఞ మేరకు ఆ చిన్ని కృష్ణుడి విగ్రహాన్ని ఆలయ ప్రధానార్చకులు కానుకగా ఇచ్చారు. ఆ విగ్రహాన్ని తీసుకొచ్చి తెన్నాంగూరులో రుక్మిణీ సమేత పాండురంగస్వామికి ప్రత్యేక ఆలయాన్ని నిర్మించి అందులో ప్రతిష్ఠించారు. తిరువణ్ణామలై జిల్లా వందవాసికి 8 కి.మీ.ల దూరంలో, కాంచీపురం నుంచి 35కి.మీ.ల దూరంలో తెన్నాంగూరు దివ్యక్షేత్రం ఉంది. దక్షిణ పండరీపురంగా ఈ ఆలయం ఖ్యాతిగడించింది.



వేంకటేశ్వర, అలమేలు మంగ అలంకారం



ఫలాలంకారంతో స్వామి అమ్మవార్లు

ఆలయవైభవం...

ఈ ఆలయం తూర్పుదిశగా నిర్మితమై ఉంది. ప్రవేశద్వారం వద్ద గోపురాలున్నాయి. మూడువైపులా కుడ్యాలున్నాయి. తూర్పు దిశగా రాజగోపురం నిర్మితమై ఉంది. నాలుగువైపులా ఉన్న నాలుగు గోపురాలు చాళుక్యుల గోపుర శైలిలో నిర్మించారు. తూర్పు ప్రవేశద్వారం బలిపీఠం, పదహారు స్తంభాలతో సభా మండపం ఉన్నాయి. ఆ మండపంలో గరుడాళ్వార్ రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆరాధిస్తున్న భంగిమలో కొలువుదీరి ఉన్నారు. సభామండపం నుంచి మహామండపంలోకి ప్రవేశిస్తే గోడలపై ఉన్న కృష్ణుడి లీలా విశేషాలు తెలిపే అందమైన ఫైబర్‌గ్లాస్ పెయింటింగులు కనులకు విందు చేస్తాయి. మహామండపం గోపురం పైకప్పు రాసలీల కుడ్య చిత్రాలు భక్తులను మరింత మంత్ర ముగ్ధులను గావిస్తాయి. గర్భగుడి ప్రవేశానికి ఇరుపక్కలా పంచలోహాలతో తయారైన ద్వార పాలకులు కనిపిస్తారు. ద్వారపాలకులు సమీపంలో కూర్మదాసర్ ప్రభువు ఉన్నారు. సంరక్షక దేవతలు, దేవతామూర్తుల బొమ్మలతో అలంకరించిన వెండి తలుపు గర్భగుడి ప్రవేశ ద్వారం వద్ద ఉంది. మహామండపం నుంచి అర్థమండపం, గర్భగృహం అనే రెండు భాగాలతో కూడిన గర్భాలయంలో ప్రవేశించగానే అర్థమండపం లేదా మధ్యమండపం లోపలి పైకప్పులో శ్రీకృష్ణుడి ఫైబర్ గ్లాస్ పెయింటింగ్స్, దశావతారాల వర్ణచిత్రాలు అలరిస్తాయి. ఆసియాఖండంలోనే బాలకృష్ణుడి లీలావిశేషాలను తెలిపే ఫైబర్‌గ్లాస్ పెయింటింగులు కలిగిన ఏకైక ఆలయంగా ఈ ఆలయం ఖ్యాతిగడించింది. గర్భాలయంలో పాండురంగనాథుడు, రుక్మిణీదేవి సర్వాలంకరణశోభితులై దర్శనమిస్తారు. పాండురంగడి విగ్రహం 12 అడుగుల ఎత్తు, రుక్మిణీదేవి విగ్రహం 10 అడుగుల ఎత్తు ఉన్నాయి. చక్రత్తాళ్వార్, యోగనరసింహస్వామి, శ్రీనివాసపెరుమాళ్ వెండి విగ్రహాలు కూడా దర్శనమిస్తాయి.

కల్యాణోత్సవం...

ఈ ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం అత్యంత విశిష్టమైనది. వైదిక సంప్రదాయం ప్రకారం అష్టపది, చూర్ణికై భజన సంప్రదాయం ప్రకారం ఈ వేడుకలు నిర్వహిస్తారు. వివాహ వేడుకలు మూర్తిత్రయం స్వామి జ్ఞానానందగిరి, హరిదాస్‌గిరి, నామానందగిరి స్వామి సూచించిన అతిముఖ్యమైన సేవగా నిత్యం అన్నదానం నిర్వహిస్తారు. యేటా ఈ ఆలయంలో అన్నపావాడై పండుగను నిర్వహిస్తారు. అందులో పాండురంగ భగవానుడి చిత్రాన్నం అని పిలిచే వివిధ రకాల ధాన్యాలతో పూజిస్తారు. ఆ సందర్భంగా భక్తులందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థిస్తారు. ఈ ఉత్సవాలకు విచ్చేసే వేలాదిమంది భక్తులకు ఈ అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేస్తారు. ఈ వేడుకలు ఆషాఢ ఏకాదశికి ముందు రోజు జరుగుతాయి. ఆషాఢ ఏకాదశి నాడు ఉత్సవమూర్తి గోవిందరాజ పెరుమాళ్ రుక్మిణి, సత్యభామ సమేతుడైన ఆలయ నాలుగు ప్రాకారాల్లో ఊరేగుతారు. కార్తీక ఏకాదశి రోజున ఉత్సవమూర్తులైన అచ్యుత రాజన్, శ్రీదేవి, భూదేవి సమేతుడై ఆలయం వెలుపల ఊరేగుతారు. ఆ రెండు రోజులూ భక్తులు ఊరేగింపు వేడుకలలో పాల్గొని నామసంకీర్తనం, నృత్యాలు చేస్తారు.



వెన్న అలంకారంతో స్వామిఅమ్మవార్లు

పచ్చదనంతో ప్రాకారాలు..

గర్భాలయంలో భక్తులు రుక్మిణి సమేత పాండురంగనాథుడిని సేవించిన తర్వాత వెలుపలకు వస్తే ఆలయం చుట్టూ ఉన్న నాలుగు ప్రాకారాలు పచ్చదనంతో కళకళలాడుతుండటాన్ని చూడవచ్చు. అన్ని వైపులా పూల మొక్కలతో పచ్చటి వనాలు ఉన్నాయి. భక్తులు ఒడిశాలోని పూరీ జగన్నాథస్వామి ఆలయం గోపురంలా నిర్మితమై ఉన్న (గర్భాలయంపైనున్న) విమానాన్ని చూసి విస్మయం చెందుతారు.

రాజ అలంకారం...

ఈ ఆలయంలో ప్రతి ఆదివారం పాండురంగనాథస్వామిని రాజస్థాన్ యువరాజులా తలపాగా, నెమలి ఈకలతో మకర కుండలాలతో అలంకరిస్తారు. ఖడ్గధారియై పాదుకలు ధరించి నుదుట కస్తూరీతిలకం, మెడలో పూలమాలలు ధరిస్తారు. ప్రతి గురువారం స్వామిఅమ్మవార్లకు సుగంధ పరిమళాలు, పాలు, పెరుగు, తేనె, పంచామృతం, గంధం, లేతనారికేళ జలంతో తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ రోజున వెండి కవచ అలంకారంతో స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు.

అరుదైన స్థలవృక్షం...

ఈ ఆలయంలో అరుదైన తమలవృక్షం స్థలవృక్షంగా ఉంటోంది. ఇలాంటి వృక్షాలు ఒడిశాలోని సాక్షిగోపాల్, ఉత్తరప్రదేశ్‌లోని సాకేత్‌లో మాత్రమే ఉన్నాయి. భక్తులు తమ కోరికలు నెరవేరాలని ఈ వృక్షానికి ముడుపులు కట్టి ప్రార్థిస్తారు. ఈ స్థల వృక్షాన్ని పన్నెండు సార్లు ప్రదక్షిణ చేస్తారు.

ఆలయ ఉత్సవాలు..

ఈ ఆలయంలో తమిళ సంవత్సరాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. దేవతా మూర్తులను వివిధ రకాల ఫలాలతో అలంకరిస్తారు. గోకులాష్టమి, ఆ తర్వాత నామసంకీర్తనా సప్తాహం (ఏడు రోజుల పూజలు) నిర్వహిస్తారు. గోవర్ధనగిరిధారి రూపంలో, అర్జునుడికి గీతోపదేశం చేసే పార్థసారథిగా స్వామివారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతినెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉత్సవమూర్తిని స్వర్ణ రథంలో ఊరేగిస్తారు.

ఎలా వెళ్లాలి?

కాంచీపురం నుంచి, వందవాసి నుండి తెన్నాంగూరు దివ్య క్షేత్రానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సుల్లో తెన్నాంగూరు బస్టాండు దిగిన వెంటనే సమీపంలోనే ఈ ఆలయం దర్శనమిస్తుంది. కాంచీపురం, వందవాసి నుంచి ఆటోలు, ప్రైవేటు టాక్సీల్లోనూ తెన్నాంగూరుకు వెళ్ళవచ్చు. రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



అశ్వవాహనంపై స్వామివారు

'మంగై' నాకు స్పెషల్

● 'కయల్' ఆనంది

తాను తాజాగా నటించిన 'మంగై' తనకు ఓ స్పెషల్ మూవీ అని హీరోయిన్ 'కయల్' ఆనంది అన్నారు. ఈ సినిమా తన కెరీర్‌కు దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. జేఎస్‌ఎం పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత ఏఆర్ జాఫర్ సాదిక్ నిర్మాణ సారథ్యంలో కుబేరన్ కామాక్షి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మంగై'. మార్చి 1న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ఈ మూవీ ఆడియో, ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. ఇందులో 'కయల్' ఆనంది మాట్లాడుతూ... 'నేను నటించిన 'కయల్' సినిమా విడుదలై పదేళ్లైంది. కానీ, ఇప్పటికీ ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకున్నారు. ఆ సినిమా టైటిల్ పేరుతో నా పేరు స్థిరపడింది. పదేళ్ల తర్వాత నాకు 'మంగై' మూవీ స్పెషల్. పదో తరగతి చదువుతున్నపుడే సినిమాల్లో నటించాలని ఇండస్ట్రీకి వచ్చాను. అప్పుడు సినిమాల గురించి నాకు ఏమీ తెలియదు. ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నా. ఈ సినిమా నా కెరీర్‌కు సాయపడుతుందని భావిస్తున్నా. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమాను దర్శకుడు తెరకెక్కించారు' అని పేర్కొన్నారు. దర్శకుడు కుబేరన్ కామాక్షి మాట్లాడుతూ... 'ఈ సినిమాలో నటించిన ప్రతి ఆర్టిస్టుకు, పనిచేసిన టెక్నీషియన్‌లకు ధన్యవాదాలు. ఈ మూవీకి మీడియా మిత్రులు సపోర్టు చేయాలి' అన్నారు. నిర్మాత జాఫర్ మాట్లాడుతూ, 'ఒక చిత్రాన్ని నిర్మించడమే పెద్ద పనికాదు. దాన్ని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లడం ఎంతో ముఖ్యం. ఇందుకోసం నేను కృషి చేస్తున్నా. సంగీత దర్శకుడిగా వచ్చిన అవకాశాన్ని దీసన్ సద్వినియోగం చేసుకున్నారు' అన్నారు. అలాగే, దర్శకులు లెనిన్, రోహంత్, హలితా సమీమ్, నటుడు జయప్రకాష్, సంగీత దర్శకుడు దీసన్, నటుడు దుష్యంత్ తదితరులు ప్రసంగించారు.



విలేకరుల సమావేశంలో 'మంగై' చిత్ర బృందం



విలేకరుల సమావేశంలో చిత్ర బృందం

'బర్త్‌మార్క్' జనన ప్రక్రియపై అవగాహన: విక్రమ్ శ్రీధరన్

విక్రమ్ శ్రీధరన్ దర్శకత్వంలో షబీర్ కల్లరక్కల్, మిర్నా జంటగా నటించగా, శ్రీరామ్ శివరామన్, విక్రమన్ శ్రీధరన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బర్త్‌మార్క్'. ఈ చిత్రం శుక్రవారం 23న విడుదల కానుంది. గురువారం రాత్రి ఈ చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో దర్శకుడు విక్రమ్ శ్రీధరన్ మాట్లాడుతూ... 'ఈ సినిమా జనన ప్రక్రియపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రూపొందించాం. కథలో భాగమేకావడం వల్ల టైటిల్ 'బర్త్ మార్క్'గా ఆంగ్లంలో పెట్టాం. ఈ స్టోరీ కార్గిల్ యుద్ధం తర్వాత 1999లో జరిగింది. షబ్బీర్ పాత్ర డానీ అప్పటి మూడ్‌ను ప్రతిబింబిస్తుంది. జెనీ అనే గర్భిణిగా మిర్నా అద్భుతంగా నటించారు. యుద్ధవీరుడు మూడ్, గర్భిణీ మార్పులు ఇలా అన్ని అంశాలపై పరిశోధన చేశాకే స్క్రిప్టును సిద్ధం చేశాం. ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ సంగీతం అతిపెద్ద బలం' అన్నారు. నటుడు షబ్బీర్ మాట్లాడుతూ, "సర్పాట్టా పరంబరై' తర్వాత హీరోగా సంతకం చేసిన తొలి సినిమా ఇది. ఆ తర్వాత కొన్ని తమిళం, తెలుగు చిత్రాలకు సంతకాలు చేశాను. దర్శకుడు ఇచ్చిన ఇన్‌పుట్స్‌తో సినిమాలో నా బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చా. సినిమాలో లిప్‌లాక్ సీన్ కథలో భాగంగానే ఉంటుంది' అని పేర్కొన్నారు.

హీరోగా దర్శకుడు ముత్తయ్య కొడుకు

గ్రామీణ నేపథ్యంలో సినిమాలు తీయడంలోగుర్తింపును తెచ్చుకున్న దర్శకుడు ముత్తయ్య తన కుమారుడిని హీరోగా చేయనున్నారు. ముత్తయ్య దర్శకత్వం వహించిన 'కుట్టిపులి', 'కొంబన్', 'మరుదు', 'కొడివీరన్', 'పులికుత్తి పాండి', 'విరుమన్' ఇలా అన్ని చిత్రాలు గ్రామీణ నేపథ్యంలో మదురై జిల్లా చుట్టూ తిరిగేలా స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఇపుడు తెరకెక్కించే సినిమా కూడా అదే బాణీలో పూర్తి చేయనున్నారు. ముత్తయ్య కుమారుడు విజయ్ ముత్తయ్య, దర్శిని, బ్రిగిడ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. మిగిలిన పాత్రల్లోనూ పూర్తిగా కొత్త వారిని నటింపజేయాలని దర్శకుడు ప్లాన్ చేశారు. షూటింగ్ కూడా ఒకే షెడ్యూల్‌లో పూర్తి చేయనున్నారు. ఈ మూవీలోని అత్యంత కీలకమైన ఫైట్ సీక్వెన్స్‌ను మాత్రం వారం రోజుల పాటు చిత్రీకరించనున్నారు. ఇందుకోసం భారీ వ్యయంతో సినిమా థియేటర్ సెట్‌ను నిర్మించారు. కేకేఆర్ సినిమాస్ బ్యానరుపై రమేష్ పాండ్యన్ నిర్మించే ఈ చిత్రానికి కెమెరా ఎం.సుకుమార్, కూర్పు వెంకటరాజు, సంగీతం జెన్ మార్టిన్.



ప్రొడక్షన్ నెం.1 పూజా కార్యక్రమం

చిత్రజ్యోతి

వేసవిలో 'రోమియో'

విజయ్ ఆంటోనీ, మృణాలి రవి జంటగా నటించిన చిత్రం 'రోమియో'. వేసవికి విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం ద్వారా భరత్ ధనశేఖర్ సంగీత దర్శకుడిగా కోలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానరుపై మీరా విజయ్ ఆంటోని సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కింది. వినాయక్ వైద్యనాథన్ దర్శకుడు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ 'చెల్లికిల్లి' పాటను తాజాగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ భరత్ ధనశేఖర్ మాట్లాడుతూ... 'నా ప్రియమైన స్నేహితుడు వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'రోమియో' చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయమవుతుండడం సంతోషంగా ఉంది. చెల్లకిల్లి లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశాం. విజయ్ ఆంటోని, హేమంత్ ప్రకాష్, జెనీఫర్ రాజశేఖర్ కలిసి సాహిత్యం అందిచగా, ఆదిత్య ఆర్.కెవిన్ నేపథ్యగానం చేశారు. ఈ మూవీ కోసం నేను కంపోజ్ చేసిన తొలి ట్యూన్ ఇదే. ఈ సినిమా ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం కావడం సరికొత్త అనుభూతిని మిగిల్చింది. 'రోమియో' చిత్ర విజయానికి నేను సమకూర్చిన సంగీతం కూడా ఒక కారణంగా ఉంటుందని బలంగా నమ్ముతున్నా' అని పేర్కొన్నారు.



విజయ్ ఆంటోని - భరత్ ధనశేఖర్

కాసాగ్రాండ్‌లో 360 డిగ్రీ సూపర్ ఇమ్మర్సివ్ డోం థియేటర్



చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్స్‌లో ఒకటైన కాసాగ్రాండ్ సంస్థ దేశంలోనే ప్రథమంగా స్థానిక కేలంబాక్కం - వండలూర్‌రోడ్డులో ఉన్న 'సన్‌సిటీ'లో 360 డిగ్రీ సూపర్ ఇమ్మర్సివ్ డోం థియేటర్‌ను ఏర్పాటు చేసింది. దీనిపై సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు కె.రవిచంద్రన్ మాట్లాడుతూ... 'సన్ డ్యాన్స్' పేరుతో ఏర్పాటు చేసిన ఈ థియేటర్ కొత్త శకానికి నాంది పలికినట్లైందన్నారు. ఇది వినోదాన్ని అధిగమించి అపూర్వమైన ఇంద్రియ అనుభవాన్ని రూపొందించడానికి యానిమేటెడ్ కథలను వాస్తవికతతో విలీనం చేస్తుందన్నారు. తమ సంస్థ ప్రపంచం అందించే అత్యుత్తమ అనుభవాలను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడంలో డోం థియేటర్ ఒకటని చెప్పారు.

'మెకెదాటు'పై నిర్లక్ష్యం చూపొద్దు

● అసెంబ్లీలో ఈపీఎస్ డిమాండ్

ప్యారీస్, ఫిబ్రవరి 22: తమిళనాడు - కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదాస్పదమైన మెకెదాటు డ్యాం వ్యవహారంలో రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం చూపరాదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మెకెదాటు డ్యాం వ్యవహారానికి సంబంధించి జరిగిన చర్చల్లో పళనిస్వామి సహా పలువురు సభ్యులు మాట్లాడారు. ముందుగా మంత్రి దురైమురుగన్ ఈ అంశంపై మాట్లాడుతూ... మెకెదాటు ప్రాంతం వద్ద కర్ణాటక ప్రభుత్వం ఒక ఇటుకను కూడా పెట్టడం సాధ్యం కాదన్నారు. ఆయన సమాధానం తృప్తికరంగా లేదంటూ అన్నాడీఎంకే, పీఎంకేల సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. కావేరి కమిషన్ సమావేశం కానందు వల్లే గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో మెకెదాటు డ్యాం సమస్య రాలేదని, ఎందుకంటే ఆ కమిషన్‌కు చైర్మన్‌ను నియమించక పోవడమేనని మంత్రి దురైమురుగన్ సభలో వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక కావేరి కమిషన్‌కు చైర్మన్‌ను నియమింపజేయడంతో పాటు మెకెదాటు డ్యాం వ్యవహారంలో 2018 నుంచి 2022వ సంవత్సరం వరకు న్యాయస్థానంలో నాలుగు కేసులు దాఖలు చేశామని గుర్తు చేశారు. ఇదే వ్యవహారంలో కావేరి మేనేజ్‌మెంట్ కమిషన్‌లో ఈ నెల 11వ తేది ఏర్పాటు చేసిన సమావేశంలో కూడా డీఎంకే ప్రభుత్వం అంశాన్ని లేవనెత్తడమే కాకుండా వ్యతిరేకించిందని తెలిపారు. ఇదే సమావేశంలో కేరళ, పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యతిరేకత తెలియజేశాయన్నారు. ఇదిలా ఉండగా మెకెదాటు డ్యాం వ్యవహారంలో మంత్రి దురైమురుగన్ వాస్తవాలు వెల్లడించడం లేదని, అందువల్లే తమ పార్టీ సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారని ఎడప్పాడి తెలిపారు.



హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన కారు ప్రమాదంలో తన కుమారుడు వెట్రి దురైస్వామిని కోల్పోయి శోకంలో ఉన్న చెన్నై నగర మాజీ మేయర్ సైదై దురైస్వామిని సీఐటీ నగర్‌లోని ఆయన నివాసంలో కలుసుకుని పరామర్శించిన ఎంఎన్‌ఎం అధ్యక్షుడు, సినీ నటుడు కమల హాసన్. ఈ సందర్భంగా వెట్రి దురైస్వామి చిత్రపటానికి కమల్ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు